# ప్రాక్పశ్చిమాలు

ప్రొద్దువాటారుతోంది. ఆ చిన్న రైల్వే స్టేషన్‌కి యిరువైపులా, పారే కృష్ణ కాలవలు, బంగారు రంగు సూర్యకిరణాలతో మనోహరంగా కనిపిస్తున్నాయి. చుట్టూ తుమ్మ బీళ్ళతో వ్యాపించివున్న ఆ స్టేషన్, చీకటి కరుళ్ళు కరుళ్ళుగా ముసురుకోగానే, విద్యుద్దీపాల కాంతులతో ప్రకాశవంత మవుతుంది. కళాహృదయం, క్షణంసేపు గిజిగాని గూడులాగా చలించటానికి, ఆ స్టేషన్ చుట్టూవున్న వాతావరణమెంతో ప్రశాంతమై, తోడ్పడుతూవుంటుంది.

ప్రొద్దు బాగా పడమటి దిక్కున దాగిపోయింది సిరావానలాంటి చీకటి, ఆ తుమ్మబీళ్ళగుండా, యీతబొత్తలపై, వింగిని చూసే గడ్డికొసలపై జలజలమని రాలుతోంది. దానికి సైదోడుగా మంచుకూడా కురుస్తోంది. పోర్టరు గంట కొట్టాడు. తూర్పు దిక్కుగా పచ్చరంగు రెక్క వాలింది. రైలు ఆవరించిన చీకటిని, దూసుకుంటూ, స్టేషన్‌లోకివచ్చి ఆగింది..రెండోక్లాసు నుండి ఒక నాజూకు యువకుడు దిగాడు. రైలు కూతకూసి, కదలి వెళ్ళిపోయింది.

రైలు దిగిన ఆయువకుడు జెండాకర్రలాగా, ఆ ప్లాటుఫారాన్నంతా కలయచూశాడు. చీకటి గుండెలో వెలిగిన దీపంలాగా, ఆ స్టేషన్ తప్ప, మరేయితర దృశ్యమూ అతనికి కనిపించలేదు. కాసేపు అటూ—యిటూ విషాదంగా పచార్లు చేశాడు. అతనితో యెవరూ దిగనన్నాలేదు. కనీసం ఒక్క ప్రయాణీకుడైనా, ఆప్రాంతంలో దృగ్గోచరంకాలేదు. ఆశ్చర్యంవేసింది.ఆయువకుడు చేతులూపుకుంటూ నత్తలాగా నడుస్తూ, చేరువలో అతనికి మల్లేవున్న విద్యుద్దీప స్తంభం క్రిందికి చేరాడు. కరకమలాల్లో వున్న క్యాలికో బైండు పుస్తకాన్ని కాసేపు వుబుసు పోకగా చూస్తూ నిర్వేదంతో కాలక్షేపం చేయసాగాడు... ఏమీ తోచటం లేదు కాబోలు, కళ్ళజోడు తీసి అద్దాలు తుడవటం మొదలెట్టాడు. శరీరానికి వదులుగావున్న పైజామా, లాల్చీలు, తూర్పుగాలి విసుర్లకి, రెపరెపలాడుతున్నాయి. తొడిగిన ఆకు చెప్పుల్లో, చలిగాడు చిలిపిగా దూరి, గిలిగింతలు పెడుతూ, వణకిస్తున్నాడు..సిగరెట్లు, వూరికే కాల్చబడుతున్నాయి.,అతనో బెంగాలీ బాబులాగా, ఆప్రగాడగాడధ్వాంతిలో, ఒక గొప్ప కవిత్వంవ్రాసే గాసగాడి వినూత్నభావ పరంపరలతో, అలమటిస్తున్నాడు..ఎందుకు ఆ స్టేషన్‌లో దిగాడో? అడిగి తెలుసుకొనే దిక్కులేదు. ఎవరికోసం, చూస్తూ, ఎక్కడికి పోవాలనుకుంటున్నాడో! అతని ముఖంవల్ల వ్యక్తంకావటంలేదు. ఎంతసేపు అలా కాలాన్ని వృథాచేస్తాడో? యేమీ అర్థంలేకుండా వుంది...వాస్తవంగా 'అర్థంలేకుండా ప్రవర్తించటం, మానవుడికో అలవాటు.'

అరగంట గడిచింది. పడమటిదెసనుండి రైలు రావాలి. కానీ, రాలేదు. ఆలస్యం, అతని వాటర్ ప్రూఫ్ గడియారంద్వారా, భరించలేనంతగా అయింది. "వెధవరైళ్ళు. అవసరానికి యెప్పుడూ ఆలస్యంగానే వస్తాయి.." అతను ముఖం చిట్లించుకొంటూ లోలోన విసుక్కున్నాడు చిరాకుగా. అయినా, రైలు రాలేదు. అదే విచిత్రం." మానవుని ఆదుర్దాకూ, అభిరుచుల ఆవేదనాలకూ మనోభావాలవేగానికీ కాలం యెప్పుడూ ఆలస్యంగా ప్రవర్తించి, ఆటంకాలనూ—విసుగునీ అసహ్యాన్ని కల్గిస్తుంది. తృప్తినీ, ఆకాంక్షనూ అణగారుస్తుంది.

"ఏమిటీ యింకా రైలు రాలేదు...ఛీ....!"—అతను తూష్ణీభావంతో, పడమరగా చూసి, చేతిలో పుస్తకాన్ని గభాల్ను తెరచి, టపామని మూసేశాడు...మళ్ళా గడియారాన్ని చూసుకున్నాడు... ఎనిమిదిన్నర పైచిలుకు అయింది. అతనొక మహారణ్యంలో—ఒంటరి బంగళాలో—దిక్కు తోచక శాపగ్రస్థుడై పడివున్నట్లుగా భావించుకోసాగాడు. నిల్చుండి, నిరీక్షించే వోపికలేక, వెళ్ళి నెమ్మదిగా ఒక కొయ్య బెంచీపై చతికిలబడ్డాడు. సిగరెట్టు బలహీనంగా ముట్టించాడు.. వదులుతున్న పొగ వుంగరాలు తిరుగుతూ, విరహ విషాద నిషా హమేషా లోకి పోయి ఐక్యమవుతోంది—ఆడదాన్ని గురించి మొగవాడిలో ఆలోచనే కలగకూడదు. ఒకవేళ కలిగిందో, వాడి యావజ్జీవిత శక్తీ చాలదు—ఆలోచించి ఆనందపడటానికి... పురుషుడు పురుషత్వంతో యేనాడైతే, బ్రతకలేక పోతాడో, ఆనాడే అతగాడి చుట్టూ స్త్రీకి సంబంధించిన విషయమంతా, విషాద రూపంలో మహావైతరణి వాహినియై వుంటుంది—

"అసలు ఆవిడగారు వస్తుందో? రాదో?"—అతను సందేహంగా ఆలోచించసాగాడు. గడియారం ఆలస్యాన్నిఃఃసహా, మరేవిషయాన్ని తెలపటంలేదు. "యివ్వాళ జగన్మోహన్ వివాహమని గుర్తుందో? లేదో?"— అతను పడమరగా చూస్తూ అన్నాడు తనలో తానై. సందేహాల మూట విప్పటమే పొరబాటు. అన్నీ అవ్వే క్రొత్త రూపం దాల్చి, మనిషిని క్రుంగతీస్తాయి..

ఇంతలో, అకస్మాత్తుగా పోర్టరు గంట మ్రోగించాడు. సిగ్నల్ యివ్వబడింది. రైలు ఒక కొండకొమ్ము కావలనుండి మలుపు తిరుగుతూ వచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తూ వున్నాయి. అతను దిగ్గునలేచి, ప్లాటుఫారంమీది కొచ్చి, గంపెడు సంతోషంతో నిలబడ్డాడు.. చీకటిని చీలుస్తూ, రైలు మెలికలు తిరుగుతూ వచ్చి—వచ్చి ఆ స్టేషన్‌లో బరువుగా ఆగింది. అతను, పెట్టెల్ని ఒక్కటొక్కటిగా చూస్తూ, ముందుకీ—వెనక్కీ తిరుగాడుతున్నాడు.. ..... 'శంపాలత'—ఆ చీకటి తెరల్ని తొలగతీస్తూ దిగింది. అతను చూడలేదు. యింకా అటూ—

## "రాఘవ"

యిటూ ఆదుర్దాగా చూస్తూ, నిరాశను కల్పించుకుంటూ వున్నాడు. రైలు ఒక్క పెట్టున గాండ్రించి, కదిలి ... వెళ్ళిపోయింది ... అతను, బరువుగా, వెళ్ళిపోతున్న రైలుని చూసి, నిట్టూర్చాడు..ఆమె, స్టేషను మాస్టరుకి టికెట్టు యిస్తూ నిలబడింది. అతన్ను తలవంచుకొని, ముందుకి వస్తూ, ఆమెను చూడకుండా, తిన్నగా యెటోదారి తీయ బోతున్నాడు. ఆమె అదాటున చూసింది. తొందర, తొందరగా రెండడుగులువేసి,—"నమస్కారం వేణుగోపాలం గారు!"—అంటూ అతని పరధ్యానాన్ని భగ్నం చేసింది. అతను తలప్రక్కకి త్రిప్పి చూశాడు. దివినుండి జారిన దివ్యమణిలాగా 'శంపాలత' అతని కళ్ళముందు తళుక్కున మెరిసింది. ప్రతి నమస్కారం సమర్పిస్తూ—తన నిరీక్షణనంతా, ఒక్కమాటలో పొదుగుతూ—

"తమకోసం యింతదాకా యెదురు చూసేసరికి,..."యింకేదో అనబోయాడు..

"అలసిపోయారా? కళ్ళుకాయలు కాచాయా? మనసుని రాయి చేసుకున్నారా? యేమైందీ?"—శంపాలత గుక్క తిప్పు కోకుండా అనేసింది—

"మీరు చెప్పినవన్నీ నిజమే అయినయి.."—ముక్తసరిగా వేణుగోపాలం అన్నాడు. అంతకన్నా యెక్కువ మాట్లాడినా, శంపాలత వద్ద యేం లాభంలేదు కాబట్టి—

"మీరు భలే తమాషా మనుషులండీ!" —అంటూ ఆమె 'చలం' నాయికలా నవ్వింది. అతనికి ఒళ్ళుమండి పోయింది. ఇరువురూ జగన్మోహన్ గ్రామానికి, నడవటం మొదలెట్టారు —ప్రక్క ప్రక్కగా శబ్దార్థాల్లాగా — ఆ చీకట్లో. శంపాలత 'బుచ్చిబాబుకి' యిష్టమైన అవయవాల కదలికలతో, నడుస్తూ — వుంటే, వేణుగోపాలం, త్రాసు త్రాడులాగా నడుస్తూ, వూగుతున్నాడు. 'భరద్వాజ' మాటల మూటను, రాణింపు కోసం విప్పుతూ — శంపాలత, "మీరెప్పుడొచ్చారూ?" అంది. వేణుగోపాలం చెప్పాడు..శరత్‌బాబు గనుక, ఆ దృష్టంకొద్దీ జీవించివున్నట్లయితే, వేణుగోపాలం చెప్పిన సమాధానాన్ని, ఒక నవలగా వ్రాసివుండేవాడు.. పాపం! లేకపోయాడు. చరిత్రకే, కానిదశ యేర్పడింది. అసలు సాహిత్యానికే అదృష్టం పోయింది... ఇరువురూ స్టేషన్ దాటి ఒక ఫర్లాంగు దూరమ్ము కాలవగట్టు

వెంట నడిచారు. అటుపిమ్మట దారి, చేలగట్ల మీదుగా మళ్లి, పోతూవుంది — పట్న వాసంలో అలవాటైన నడకను, పల్లెటూరి మార్గంలోకి మార్చవలసి వచ్చేసరికి యిరువురిలోనూ ఒక ప్రత్యేకమైన మార్పు కనబడింది —.

వరిచేలకు అడ్డంబడి, గట్లమీదుగా, జనప మొక్కల్ని తొలుక్కుంటూ, పాదాలక్రింద మెత్తగా తగిలే, పసిరిక కాడల్ని దాటుతూ, పురుగూ పుట్రావుంటయ్యేమో! అని భయపడుతూ— శరత్ రచనా శైలిలాగా వేణుగోపాలమూ, చలం, కలంబాణిలాగ శంపాలత నడుస్తున్నారు. చీకటి తెరలు వాళ్లిద్దర్నీ క్రమ్మేస్తున్నయి. చలి గాలి, పీక్కు తింటోంది —. అతను వేడి కోసం సిగరెట్లు కాలుస్తున్నాడు. ఆమె కుతి తీరేందుకు వక్కపొడి నములుతోంది.

"ఇంకా యెంతదూరం మిట్లా అవస్థ పడాలి?" — గడక్రల మధ్య త్రాడుమీద నడిచే అబలలాగ వేణుగోపాలం, శంపాలతను ప్రశ్నించాడు. ఆమె, సానిదాని నోటినుండి, స్వగతంలో పగిలే గాజు ముక్కల్లాంటి చిరునవ్వుల్ని విరజిమ్ముతూ —" కాస్త దూరమే" అంది — యిరువురూ సభ్యతకు కట్టుబడిన వాళ్లలా నడుస్తూ, కడకు చేలగట్లు దిగి, ఒక యెండిన యేటి యిసుకకు యెదురు నడుస్తూ పోసాగారు..—అది అవూరు చేరేందుకు ఒక్కటే అనువైన మార్గం... దగ్గర దారి కూడానూ...

"జగన్మోహన్ వక్కా పల్లెటూల్లో పెళ్లి చేసుకోక పోతే, అందరూ రావటానికి, అనువుగా వుంటే, యే పట్నంలోనో చేసుకుంటే ఎంత బావుండేది?"

"అవునవును" ఆమె యెద్దేవాగా అంది. అతనికి అర్థం కాలేదు..

"ఏమిటలా అన్నారు?"—అతను తెల్లమొగం వేస్తూ అడిగాడు..

"ఆడవాళ్లు అప్పుడప్పుడూ అలా యేవేవో అంటూ వుంటారు. మీలాంటి వాళ్లు అస్తమానమూ శల్య పరీక్ష చేస్తూ 'ఏమిటీ' అని అడక్కూడదు. ఏమీ లేక పోయినా, ఏదో ఒకటి అనటమే ఆడవాళ్లకు లక్షణం"

—లక్షణంకాదు. అమాటంటే అసలు నేను ఒప్పుకోను. 'జబ్బు' అనండి!"

"యీ వాదన వల్ల ప్రయోజన మేముంది చెప్పండి!

"వూరు చేరేవరకు యింకేం మాట్లాడుతాం?".

"మాట్లాడ దల్చుకుంటే లక్ష సమస్య లున్నయి."

"ఒకటి చెప్పండి శంపాలతగారూ!" — అతను నవ్వుతూ అడిగాడు.

"మీ అభిమాన రచయిత యెవరు?" ఆమె అడిగింది.

"శరత్‌బాబు!"— వేణుగోపాలం — అత్మ విశ్వాసంతో చెప్పాడు. ధృడంగా..శంపాలత, "హే" అనగా పకాపకమని నవ్వింది. ద్వాదశి చంద్రుడు మసక మసకగా బూచుల్లాంటి మబ్బులమధ్య తారాడుతూ వున్నాడు. వేణుగోపాలంకి ఆమె నవ్వు పసేమీ అర్థంకాలేదు. శరత్ గనుక ఆ నవ్వుని చూసినట్లయితే, "యిలాంటి వాళ్లు నా చదువరులకు యెందుకు స్నేహలత ద్వారా పరిచయమై, తటస్థ పడ్డారా!" అని వోరున యేడ్చి ఘోషించేవాడు. కానీ వేణుగోపాలం, రవ్వంతైనా కంట తడి పెట్టలేదు. అసలు కళ్లే చెమ్మగిల్లలేదు. కానీ జరిగిందొక్కటే! 'చిన్నబోయాడు'.. అంతే! వెంటనే తెప్పరిల్లిన గళంతో — "ఏం? అలా నవ్వుతారు?" స్త్రీపట్ల సహజంగా వుండే అమాయకత్వాన్ని గుర్తు చేసుకుంటూ అడిగాడు.

"ఆ... ఏం లేదు.." ఆమె ముక్తసరిగా జవాబిచ్చింది. వేణుగోపాలంకి, "శంపాలత ఏదో చెప్పబోయి, ఆ సంగతిని మరుగు పర్చేసింది", అని తెలిసింది—.

"మీరలా అంటే నాకేమిటోగా వుంది. నన్ను నేను సంబాళించుకోలేక పోతున్నాను." వేణుగోపాలం విచలితహృదయుడై అంటున్నాడు.

"చెప్పలేరా?" —

"చేత కావటం లేదు..."

"మీది కాదా అసమర్థత. శరత్‌బాబుదే!"

"ఎందుకని?"

"అతని రచనల ప్రభావం మీలాంటి బలహీనుల్ని అలాగే మారుస్తుంది"

"అంటే ఏమిటో కాస్త విపులీకరించండి" — వేణుగోపాలం, తనేదో క్రొత్త సత్యాన్ని శోధించి కనిపెడుతున్న వాడిలాగ ప్రశ్నించాడు.

"తన మనస్సులో వున్న భావాన్ని మరో మనస్సుకి సూటీగా చెప్పలేక పోవటం, ఒక స్థిరమైన వుద్దేశ్యాన్ని పదేపదే చెబుతూ, పేజీలు నింపి, చదివేవాడికి వుత్సాహం తగ్గించటం, సరిహద్దుల్నిగీసి, పాత్ర చిత్రీకరణ చేయటం, ఒక్కొక్కడి చేత, ఒక్కోవుపన్యాసం బలవంతంగా చెప్పించి, విప్లవవాదాన్ని లేవదీయటం యిలా మందకొడి పనులు చాలా చాలా...."

"అయితే మీ అభిమాన రచయిత 'చలం' అలా చేయనే చేయలేదా?"

"లేదు..." శంపాలత గట్టిగా చెప్పింది. అతను నమ్మలేదు....

"చలం ప్రతి చిన్న విషయాన్ని గుండెకు హత్తుకునేలాగు చెప్పగలడా?"

"చచ్చేటట్టు! యెదుటివాడి నోరు మూయటానికి, శరత్‌లాగా భారీయెత్తున వాక్యాన్ని సాగతీయడు... ఒక్క మాటలో టక్కున నొక్కి చెప్పి, నోరు మూయిస్తాడు...."

"ఒదే నాకు నచ్చదు లత గారూ!"

"అందుకే మీరిలా వున్నారు..."

చంపలు వాయించి నట్లుగా శంపాలత అంది. వేణుగోపాలం అదిరిపోయాడు. యిరువురూ తర్జన భర్జనలు చేసుకుంటూ, ఆ యేరుదాటి. గ్రామంలోకి ప్రవేశించి, జగన్మోహన్ యింటికి చేరారు. అతను, ఆలస్యంగా వచ్చిన యీ యిరువుర్నీతన పెళ్లికొచ్చిన మిగతా స్నేహితులకు సంతోషంతో ఆ రాత్రే పరిచయం చేశాడు.

శంపాలత పసుపు పచ్చగా — దబ్బపండు లాగా వుంటుంది. పొట్టిగా పోతపోసిన విగ్రహానికి ఆమెకూ ఆంధ్రదేశపు అంచనా ప్రకారం అంగుళాల్లో కూడా పెద్ద తేడా యేమీ వుండదు. మరీ భూమికి జానెడెత్తుగా వుండి, మేజాకోడు. లాగా నిలబడదు. ఆమెకు, యీ పురాకృత సుకృతం తోడైందోగానీ, పురుషుడంటే వుత్త వెర్రి వెంగళప్ప అనే మోటుభావం యీనాటి వరకూ మనస్సుకి పట్టివుంది. స్వేచ్ఛా విహంగం. నిముషానికో క్రొత్త ఫ్యాషన్ రంగుచీరలు కడుతుంది. భూమి ఒకసారి తనచుట్టూ తాను తిరిగి, సూర్యుని చుట్టూ ప్రదక్షిణం చేసి వచ్చేసరికి, ఆమె ఒంటిమీద్నఅన్నిరకాల రంగుల్నీ ముచ్చటగా చూడొచ్చు. ఆమెను, యే కేంద్ర మంత్రి అయినా, పోనీ, యే రాష్ట్రమంత్రి అయినా, "ఆంధ్ర దేశపు అందాల రాణి" అని అంటే, యిక ఆంధ్ర దేశానికి సుస్థిరమైన కీర్తిప్రతిష్ఠలు ప్రాప్తించి, ధన్యమైనట్లే!—

ఇదంతా వేణుగోపాలానికి లోగడే తెలుసు.. అయినా, ఆమె నిర్మొహమాటంగా వాగే అసభ్యతగల సరదా మనిషి. ప్రాక్పశ్చిమాలలో వుండి స్నేహలత రూపేణా వుత్తరాలు జరిగినయి. ప్రాణ స్నేహితులైనారు. యిరువురూ దైవికంవల్ల అవివాహితులు. యిదేవాళ్లు తొలిగా కలుసుకోవటం. జగన్మోహన్ వివాహమేగనుక, యిప్పట్లో జరిగి వుండక పోయినట్లయితే, వాళ్ల రసమయ సమావేశం యెప్పటివరకూ వేచివుండాల్సొచ్చేదో!....పాపం!! ఏమైతేనేం, జగన్మోహన్ పెళ్లి చలవ వల్ల, వేణుగోపాలం— శంపాలతలు స్నేహపూర్వకంగా కలుసుకో గల్గారు. అంటే 'శరత్‌బాబూ — చలం' సన్నిహితత్వంతో కలుసుకున్నారని జనవాక్యం...

ఆరాత్రి పెళ్లి హడావిడిలో, జగన్మోహన్ మునిగి పోయాడు. అందరితోపాటు వేణుగోపాలమూ — శంపాలతా భోజనాలు ముగించుకున్నారు. తమకు ఒక మేడమీద బస యేర్పాటు చేయించుకున్నారు, ఇరువురూ మెల్లిగా, వెళ్లి ఆ మేడమీద గదిలో అమర్చబడివున్న కుర్చీల్లో కూర్చున్నారు. వెన్నెల పాటలు — పాటలుగా కురుస్తోంది. వాళ్ల అవసరాలు తరుచు అడిగి తీర్చేందుకు జగన్మోహన్ ద్వారా ఒక కుర్రవాడు వచ్చాడు. అతను ఆప్రాంతంలో వుంటూ చాటుగా సిగరెట్లు కాల్చుకుంటున్నాడు. ఏం చేస్తాడు మరి! గదిలో వాళ్లిద్దరూ వాదోపవాదనగా వాగుకుంటుంటే —!

"మీరేమన్నా అనుకోండి లత గారూ!"

"ఎందుకండీ!"

"చలం సాహిత్యం నాకేమిటో అసహ్యంగా వుంటుంది" —

శంపాలత, 'బుచ్చిబాబు' కోమలిలా ముఖం పెట్టి — 'చలం' రాజేశ్వరి లాగా, "అసహ్యమా! అది అనుకున్నంతగా ఆయన రచనల్లో లేనేలేదు. అది ఒకవేళ వుందేమోననీ, పోనీ, వుంటుందేమోననీ భయపడటం నాకెంతో అసహ్యంగా వుంది..."

"నిజంగా వుంది లత గారూ!"

"అది మీరనుకునే అసహ్యం కానే కాదు."

"మరేమిటి?"

"వాస్తవికతకు ఆధారమైన చెరగని భావం. ధైర్యంతో చదువుకొని, నగ్న సత్యమనేది జీవితానికి యెలా యేర్పడివుందో తెలియ పర్చే ఔషధం"

"ఆయనపట్ల మీకున్న అభిమానాన్ని, ఆత్మవంచన చేసుకుని చెబుతున్నారు"

"లేదు — వేణుగోపాలంగారూ! ఆయన రచనల్లో యేదైనా చూడండి.....:—"

"ఏది చూసినా రోత పుట్టించే భావమే! సిగ్గువేసే సన్నివేశమే ! మరీ అంత బట్టబయలుగా రచయిత అనే వ్యక్తి చేయవలసిన పాడు పనిగాదు"

"మీరు చాలా పొరబడ్డారు. చలం నవలలు — నాటికలూ—నాటకాలూ ఆ సంగతి వదిలెయ్యండి. మచ్చుకి ఒక చిన్నరచన చూడండి.!"

"ఏమిటది?"

"ఏదైతేనేం.. పేరెందుకూ? విషయం చెప్పుతాను.."

"చెప్పండి...."

ఆమె "ఒపువ్వు వూసింది" అనే పేరుగల కథను గూర్చి వుపన్యసించింది.

"నేనా కథ చదువ లేదు.." అతను ముఖం వేల వేశాడు.

"అందుకే నేను పేరు మొదట్లో చెప్పదల్చ లేదు..."

"మీరు చెప్పిన దంతా ప్రకృతిని గురించి"

"వాస్తవికత లేదా?"

"కల్పన లేకపోతే, వాస్తవికత కమ్మగా వుండదు.."

"అది కేవలం చలం దృష్టిలోనూ—సృష్టిలోనూ రంగు పూతలాంటిది. గారడీ వానిపని. రచయితకు రచనా శిల్పం తక్కువైనప్పుడు, కల్పనకోసం కళ్లు పైకెత్తి చూస్తాడు.. చెప్పదల్చుకున్న వాస్తవికతకు కల్పన కేవలం, సహాయకారిగా వుంటే నష్టమేమీ లేదు. కానీ, కల్పనకోసం, వాస్తవికతను మార్చటం కథకునికి మంచిపనిగాదు. సహృదయుడైన చదువరికి, వాస్తవికతను నిరూపించే కథలోని కల్పన గాదూ ముఖ్యం. శిల్పం. అదే చదువరికి రచయితపెట్టే భిక్ష. అంతేగానీ, కల్పనాత్మక మైన కథలో వాస్తవికతను యిమిడ్చి, మెప్పుకోలుగా వ్రాయటం, అంతపని రచయితే చేయనవుసరం లేదు. పాటకుడైన ప్రతివాడూ యింతో అంతో చేయగలడు..."

"నేను మీ జవాబుకి ఒప్పుకోను. కల్పన లేక పోతే వాస్తవికానికి రాణింపు లేదు...."

"రాణింపుకోసం శరత్‌లాగా రచనలు చేయటం చలానికి చేతగాదు. అబద్ధాన్ని — అసందర్భంగా వచ్చే సంస్కారాన్ని చలం సహించ లేడు. దొంగపూజలు చేస్తూ దేవాలయంలో కోరిన వ్యక్తిని కలుసుకోవటం, స్త్రీ హృదయం అనాదినుంచీ పాతివ్రత్య సంభూతం అని చెప్పటం — తడవ తడవకీ పాదధూళి అంటూ, ప్రవేశపెట్టిన ప్రతిస్త్రీ వంగిలేస్తూ పేజీలు దాటటం, మ్లానవదనాల్నీ — విచలిత హృదయుల్నీ — ఏంతోచక, చేయి జారిన ఆడదాని కోసం, త్రాగే పురుషుల్నీ —హుక్కా పీకుతూ చదరంగం ఆడే సోమరి పోతుల్నీ — సంస్కారమంటూ ముసలివాళ్ల దగ్గర వుపన్యాసాలిచ్చే వాళ్లనీ — గుర్తు చేసి, జాలి చూపమనటం చలానికి అలవాటు లేవు. గిట్టవు. శరత్ బాబు ఒక నవలలో చెప్పే విషయం, చలం ఒక్క వాక్యంలో తీర్చి ధక్‌మని చెప్పేస్తాడు.. చెత్త వ్రాసి," చదవండిరా బాబూ!" అని శరత్ లాగా చలం వుసూరుమనడు.. చలానికి పడికట్టుగా వ్రాయటం తెలుసు. చదువరిని యెలా తనవెంట నడిపించుకోవాలో చలానికి తప్పమరెవ్వరికీ అటుపైన తెలీదు ఇంతో అంతో తె. సూరి, వి. డి. ప్ర — బు చ్చి బా బు లి కి తె లు సు. 'తన రచన చదివే పాటకుడు తనని గురించి యేమనుకుంటున్నాడో! చలానికి యిట్టే తెలుస్తుంది.. శరత్‌కి ఏం తెలుసు?"

"మీరు చాలా వుద్రేకంగా మాట్లాడు

"మీలాంటివారితో అలా మాట్లాడితేనే గానీ తృప్తిగా వుండదు"

"అయితే యీ పాడులోకాన్ని మరింతపాడు చేయటమేనా చలం వుద్దేశ్యం?"

"అదియెవరికున్న సంస్కారాన్ని బట్టి వాళ్ల చెప్పేమాటగానీ, సహజమైంది మాత్రం గాదు. అబద్ధికుని ప్రణయం లాంటిది."

"అని మీ రెలా చెప్పగలరు?"

శంపాలత వోడిపోయింది. జవాబుకోసం తడుముకొంది. "వయసువసంత ఋతువులాగా మారినప్పుడు, పచ్చ తంపులు ముసురు కొన్నప్పుడు, కన్నెచెర విడిచివచ్చిన వన్నెల విసన కర్రల్లాంటి వయసు కత్తెకు కనీసం కుక్కయినా వుండాలి, లేకపోతే మొగదిక్కన్నా వుండాలి?!" అని స్త్రీలపాలిట వకాల్తా పుచ్చుకుని, సమర్థనీయంగా మాట్లాడే శంపాలతకు యేమీ తోచలేదు. వేణుగోపాలం, మళ్లీ ఏ ప్రశ్నా వెయిలేదు. ఆమె మూగదానిలా లేచి, గదిదాటి, వెన్నెల్లోకి వచ్చి నిలబడింది — తరువాత,ఆ కుర్రవాడు వాళ్ళిద్దరికీ ఏమిటోచెప్పి, పెళ్లిపందిరిలోకి వెంటతీసుకు పోయాడు. శంపాలత, వేణుగోపాలం ఒక్కచోట కూర్చొని జగన్మోహన్, సూత్రం కడుతుంటే చూస్తున్నారు. వేణుగోపాలం వస్తుతహా మొగమాటస్తుడు. చూసి ఆనందించుటమే అతని పరమావధి. బరువుగా వుండే పరిస్థితిని ధరించలేడు. 'కాదు కూడదు' అంటే సరేనంటాడు. అతను కీర్తి కాముడు. "శంపాలతను ఎలాగైతేనేం వోరు మూయించాను" అని సంబరపడుతూ లోలోన తృప్తి చెందసాగాడు. ఆ రాత్రి జనం అంతా ఎవరి బసలకు వాళ్ళు చేరేసరికి గురకొయ్యలు బాగా వాలినయి పడమరదిశకు. జగన్మోహన్ వివాహం జరుగుతున్నంత సేపు శంపాలత గుండెలు పులకరింపులతో తొలకరిస్తూ సలపరించినయి. వయసుకత్తె ఆలోచనలు పెళ్లి సంబరం చూసేసరికి కళ్లెంలేని గుర్రంలాగా పరుగులెత్తుతయి.

"పాతికేళ్లు వచ్చిన తన యవ్వనానికి పరమానందం యెట్లాకల్గేదీ?" కురుస్తున్న ద్వాదశి వెన్నెల్లో తడిసి పోతూ శంపాలత ఆలోచన చేయసాగింది. మబ్బుల చాటున చందమామ శంపాలతతో మతనాలాడుతున్నాడు. చుట్టూ వున్న నిద్రాణప్రకృతి నిశ్శబ్దంతో మ్లానమ్యగా నిద్రపోతోంది. తీయ తీయని వూహాలు 'అమీనా' కు కల్గినట్లు 'రాజేశ్వరి' లా తపించి పోసాగింది. 'చిత్రాంగద' మాదిరిగా, చలించసాగింది.

వేణుగోపాలం, మేడమీద గదిలో పడుకొని అటూ—యిటూ నిద్ర రాక ఒత్తిగిల్లుతున్నాడు. ఆరుబయట శంపాలత, అధరాలు తడిచేసుకొంటూ ఒకచోట కూర్చొని వుంది—అరగంట గడిచింది. వేణుగోపాలం ఒంటరిపాటును భరించలేక లేచి, ఆరు బయటి కొచ్చాడు. శంపాలత కలువపువ్వులాగా విరహ వేదనను అనుభవిస్తోంది — చలం చెప్పినట్లుగా — ఒక చోట —...

సృష్టిలోకల్లా అందమైనదీ—ఆనందమైనదీ విలువైనదీ రాత్రి. వెన్నెల కురిసే రాత్రి మరీను. స్త్రీ సౌందర్యం కళ్లారా చూడాలంటే అలాంటి వేళప్పుడే చూడాలి. రాత్రి పొద్దుపోయిన తరువాత ప్రశాంత వాతావరణంలో యే స్త్రీ కనిపించినా, ఏమాత్రం హృదయం వున్నవాడైనా ఆమెలోని రాసిక్యతను, అంత సౌందర్యాన్నీ సులభంగా గుర్తించవచ్చు. అంతమనోహరమైన రాత్రిపూట యెన్నోమాటలు జీవితాన్ని సుఖవంతంచేసేవి, పెదవులు దాటి వస్తయి. ఎందుకంటే మనస్సంతా ఆ కొద్ది సేపట్లో అనుభవంలోకి రాబోయే మధుర వాంఛల్లోకి లగ్నమై యుంటుంది.. అలాంటి మధురాతి మధురమైన కోరికల ముందుయెలాంటిఘోరప్రతిజ్ఞలయితే మాత్రం ఏం? దూది పింజల్లాగా గాలిలో తేలిపోతాయి.

"మీరింకా పడుకోలేదా?"

"లేదు" ఆమె గొంతులో యేదో దృఢ సంకల్పానికి లొంగిపోయే ధ్వని సూచకమైన భావం కదలాడింది. ఒక గాలితెర చిలిపిగా విసరిపోయింది. వాళ్లిద్దరూ దగ్గర దగ్గరగా చేరగల్గారు. ఆమె తల్లో చేమంతులు అతణ్ణి వెర్రెత్తిస్తున్నయి. ఆ మొఖంలో మెదిలే కోర్కెలు అతణ్ణి చలింప చేసినయి. మేడమీదకు పాకిన

పొరలతీగ అనలు వాళ్లను తాకి జల్లుమంటు వ్వుయి. పొరపూలు వెన్నెల్లో సోయగాన్ని చూపు తున్నయి. "యిందాకన్నుంచి మనస్సంతా ఏమి టోగా వుంది" —అతను అడగకపోయినా, ఆమె అనేసింది — అతను ఆశ్చర్యపోయాడు. నేలమీద సందుల్లోంచి చారికలు గట్టి వెన్నెల పారుతోంది.

"మీరూ — నేనూ ఒక యింటి వాళ్ల మయితే, యీ వెన్నెల రాత్రులన్నీ వృధా అయి పోవుగదా!" — శంపాలత తెంపుచేసి అడి గేసింది. వేణుగోపాలం ముఖాన్ని గుండెల్లో దాచుకుంటూ — "నేనూ అదే అను కుంటు న్నాను. సాహసించి అందామంటే మీరెక్కడ బాధపడిపోతారో! అని వూరుకున్నాను" అన్నా డు. యిరువురూ తెల్లారేవరకు సమైక్య భావా లతో, క్రొత్త జీవితానికి సోపానాలు కట్టు కున్నారు వూహాగానంతో —....

పెళ్లిచేసుకున్నాక ప్రేమించి వూహించినంత మధురంగా వుండదు జీవితం. ఆ సంవత్సరం పూర్తిగా గడవకముందే వేణుగోపాలం — శంపాలత వివాహమాడుకున్నారు. పాత మిత్రు లంతా వచ్చి సంతోషాన్ని వెలిబుచ్చారు. జగ న్మోహన్ వూరుకుండక — "శరత్‌బాబుగారి ఆదర్శాలతో చలంగారి ఆశయాలు ఏకీభవించా యన్నమాట." అన్నాడు చలోక్తిగా — అంద రితోపాటు నూత్న వధూవరులు కూడా పెళ్లి పందిట్లో వుషారుగా నవ్వారు.

"ఇదంతా నీ పెళ్లికొచ్చినందుకే జరిగింది" — వేణుగోపాలం అన్నాడు.

"చాలాసంతోషం. మనిషిని చూసి; మంచి గా మనసు మార్చుకుంటే, ఆ మానవుడు ఎప్పు డూ వుత్తముడే! "జగన్మోహన్ మెప్పుకోలుగా అన్నాడు.

ఉషారుగా మొదటి సంవత్సరం గడిచింది. అప్పుడు కష్టాలు — బాధలూ — వార్ధక్యం — ఎండుతనం — నిరర్ధకత్వం యేవీ కూడా వాళ్లలో పొడచూపలేదు. బాల్యం — యవ్వ నం — లాలస — సంతోషం — ప్రేమ — మాతృత్వం యివ్వే వాళ్లకు పెన్నిధానాలైనయి.

మందకొడిగా రెండో సంవత్సరం దొర్లింది.

లేనివన్నీ చిగిరించినయి. యింకిన బురద బాధంతా వుబికింది. రోత — కశ్మలం — పాడుకంపు — చెత్త చెదారం — మురికి వాసన కల్గినయి.

శరత్‌బాబు హృదయ దారుడ్యంతో వేణు గోపాలం, శంపాలతతో ఎలాగోలాగు సరు కొని కూడివుందామనుకునేవాడు. చస్తే కుదిరేది కా దు. చలంగారి కలంచిందులూ — పసిడిపట కులూ ఆమెను కలవర పర్చేవి. ఒకనాడు అద్దంలో చూస్తే — "నాయవ్వన మనో హరత్వమంతా, మీ బూజు పట్టిన భావాల రుద్దుడికి చిట్లిపోయింది. పెచ్చులు లేచినయి. నాలోని మదన రూపరాగమంతా కలిసిపోయింది. కాము ప్రేరణ కేవలం ఒక దిక్కుమాలిన లాలసగా మారింది. నా అందమంతా పోయింది. పరిమళం చెడింది. జుత్తు వూడిపోతోంది. కాంక్ష లేవీ నా గుండెలో గులాబీలు పూయటంలేదు యిప్పుడు నా చూపు మీ మూలంగా మార్చు కోవాల్సి వచ్చింది — నా జీవితానికి అర్ధం నా లోనే యేర్పడింది —" శంపాలత ద్విగు ణోద్రేకంతో అనసాగింది —.

వేణుగోపాలం 'శేషప్రశ్న' చదువుతూ — సానిపోర్ధ రైజడు క్లాత్‌లాగా కుంచించుకుపోతూ "ఏం?" అన్నాడు. ఆమె జవాబివ్వలేదు. అతను నిశ్చల నిరీహనేత్రాలతో ఆమెను చూస్తుండి పోయాడు కాసేపు. ఆమెకు యీ మధ్య బాగా తెలుస్తోంది — "తనలోపల క్రొత్త ప్రాణం కదులుతోంది. చోటుకోసం వెతు క్కుంటూ తన చర్మాన్ని ప్రక్కలకి బిగుతుగా సాగతీస్తోంది." — అదో పర్యుత్సుకత్వమై ఆమెను తృప్తి పరుస్తోంది —.

....— ఆ మరో సంవత్సరం భారంగా నడిచింది —...

అదొక రైల్వేస్టేషన్ సూర్యుడస్తమించాడు అమావాస్య చీకటి అలము కుంటోంది. మిణు గురు పురుగులు గాలిలో వూగుతూ తిరుగు తున్నయి.పోర్టరు మొదటి గంటకొట్టాడు. టిక్కెట్లుయివ్వటం మొదలెట్టారు. ఒకామె చీక టినీ — గాలినీ చీల్చుకొచ్చి, ఒక టిక్కెట్టు తీసుకుని ప్లాటుఫారం మీదికి వెళ్లిపోయింది. తరువాత ఒకతను వచ్చి అలాగే టిక్కెట్టు తీసుకుని, ప్లాటుఫారంమీదికి దూసుకు పోయాడు. రెండోగంట మ్రోగింది. తూర్పు నుంచి రైలు పొగలు జిమ్ముకుంటూ రాబో తోంది — స్టేషన్ మాస్టరు స్టేషను దాటి ప్లాటుఫారంమీదకొచ్చి పచార్లు చేస్తుండగా ఆ ఒకామెను చూశాడు హఠాత్తుగా —

"మీపేరు..." స్టేషన్ మాస్టరు అడి గాడు...గుర్తుకందక.

"శంపాలత..."

"ఎప్పుడొచ్చారు?" జగన్మోహన్ పెళ్లిలో కల్గిన పరిచయాన్ని పురస్కరించుకుని ఆమె చెప్పింది. విరక్తితో — విసుగుతో — అస హ్యంతో — రోతగా —

"ఎందాకా వెడుతున్నారు?"

ఆమె పడమర దిక్కు వ్రేలితో చూపింది.

"పుట్టింటికా?"

"ఊ!"

"వేణుగోపాలంగారేరీ?"

"సంసారం చేయలేక పిరికి వారైనారు.."

స్టేషన్ మాస్టరు త్రుళ్లిపడ్డాడు.

"అంటే!"

"వదిలేశారు.." ఆమె తడుముకోకుండా చెప్పిందే...

"అంతపనేనా!"

"అంతమొనగాడైన పనిని మొగవాడు తప్ప మరెవ్వరూ చేయలేరు. స్త్రీ అంటే చులకన భావం వున్న వాడితో సంసారం చేయటం చాలా కష్టం.." యింకా యేమిటో చెబు దామనుకుంటుండగా తూర్పు దిశనుండి రైలు వచ్చేసింది. శంపాలత యెక్కింది. రైలు కదిలి పడమరగా వెళ్లిపోయింది.

స్టేషన్‌మాస్టరుకి అంతా విచిత్రంగా తో చింది. ఒక సిగరెట్ ముట్టించుకుని, మెల్ల గా ప్లాటుఫారంమీద నడుస్తూ ముందుకి పోతూండగా— మూడేళ్ల క్రింద విన్న గొంతుక తనని పిల్చినట్లు భ్రమపడి ప్రక్కకి చూశాడు. వేణుగోపాలం, స్టేషన్ మాస్టరుని, చేతో రమ్మని పిలుస్తూ — వున్నాడు.

"ఇదేమిటూ!" అతను దిగ్భ్రమ చెందుతూ దగ్గరకు చేరి పల్కరించాడు.

"శంపాలత యీ బండికి వెళ్లింది గదూ!" వేణుగోపాలం నమ్ముతూ అడిగాడు. స్టేషన్ మాస్టరు "వెళ్లింది" అని చెప్పాడు.

"అదేంపని వేణుగోపాలంగారూ!" తెల్లబోయి మాస్టరడిగాడు. వేణుగోపాలం ఒక సిగరెట్ ముట్టించి —.

"నేను చాలా పొరపాటు పని చేశాను. శంపాలతను అర్ధం చేసుకోవటం చాలా కష్టం. ఆమె వుద్దేశ్యాలతో నేను ససేమిరా యేకీభ వించక పోవటమే కారణం. ఆమెకు పురుషుడు భర్తగా వుండటం గిట్టదు. ప్రాణాలర్పించే స్నేహితుడుగా వుండాలి. తనకు చీకటి అవు సరం తీర్చేటందుకే, కేవలం వుపయోగపడు తూవుండాలి. ఆమె చలంగారి రచనల్లో నడిచే దృక్పథం గల మనిషి. జీవితం కూడా ఆయన శైలిలా నడవాలంటుంది. దాన్ని నేను అస్త మానమూ ఖండించే వాణ్ణి. వాస్తవికతను కల్ప నతో సమ్మేళించి వన్నె చిన్నెలు కోరతాను నేను. ఆమె వాస్తవి కత్వంతో మసలమని కోరుతుంది. విలువా — ఆస్తిక్యత — రాణింపూ — కావా లంటాను. వీటిని ఆమె ససేమిరా ఒప్పుకోదు. ఆదర్శాలకూ — ఆశయాలకూ — అభి ప్రాయాలకూ జీవితాన్ని బాహాటంగా [illegible] గించాలంటుంది. అదినాకు యిష్టం లేదు. అం దుకే యిలా జరిగింది." అని చెప్పుకొచ్చా డు.

స్టేషన్ మాస్టరు యింకేదో ప్రశ్నించ బోయాడు.కానీ, యింతలో రైలు పడమర నుండి వస్తోంటంతో — తనపనిమీద చక్కా వెళ్లాడు. రెండు నిముషాల్లో రైలు వచ్చి ప్లా టుఫారంమీద ఆగింది. వేణుగోపాలం ఎక్కా డు. స్టేషన్ మాస్టరు ఆ సమయంలో దగ్గర కొచ్చి, ధన్యవాదాలు చెబుతూ వీడ్కోలు పల్కా డు. రైలుకదిలింది. అతను ఈ ఉద్యో ధర్మంగా నిష్క్రమించాడు.